క్లుప్తంగా

కలెక్టరేట్ సెక్యూరిటీ ఆడిట్ నిర్వహణ

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో బుధవారం సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించారు. ఇంటిలిజెన్స్ విభాగం నుంచి అడిషనల్ ఎస్పీ బి.మెహర్ బాబు, డీఆర్వో జె.వెంకటరావు, ఇతర పోలీస్‌శాఖ ఎస్‌డీపీవోలు, సిఐ ఇంటిలిజెన్స్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సదనాల రామమోహన్ ఈ ఆడిట్ కమిటీలో పాల్గొన్నారు.

పేద మహిళకు సహాయం



మందుల కిట్ అందజేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ రామస్వరూప్ జవహర్

బాలాజీచెరువు: కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్న వై.సత్యాదేవి అనే పేద మహిళకు డీవీ రాజు మల్టీ ఆర్గాన్ ఫౌండేషన్ బుధవారం దేవాలయం వీధిలో గల కార్యాలయంలో సహాయం అందజేసింది. మూడు నెలలకు సరిపడా మందులను ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రామస్వరూప్ జవహర్ అందజేశారు. వైద్యం చేయించుకుని మందుల కనుగోలుకు ఇబ్బంది పడుతూ తమ ట్రస్ట్‌ను సంప్రదించగా ఈ సహాయం అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకుడు డాక్టర్ బాదం బాలకృష్ణ, కోశాధికారి కనుమూరి రవిచంద్ర, కొల్లేపల్లి మురళీకృష్ణ పాల్గొన్నారు.

తురగా సూర్యారావుకు పురస్కారం



జాతీయ స్థాయి పురస్కారం అందుకుంటున్న సూర్యారావు

బోట్‌క్లబ్: తెలుగు సాహితీ రంగంలో ప్రతిభ కనబర్చిన వారికి శ్రీ శ్రీ కళావేదిక, వరల్డ్స్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పొయెట్రీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో అందించే జాతీయ స్థాయి పురస్కారాన్ని కాకినాడకు చెందిన తురగా సూర్యారావు అందుకున్నారు. విజయవాడలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక సీఈఓ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో సాహిత్యంలో ప్రతిభ కనబర్చిన యువ కవులకు, రచయితలకు ఈ అవార్డులు అందజేస్తారని అవార్డు గ్రహీత తురగా సూర్యారావు తెలిపారు. సూర్యారావును పలువురు సాహితీ వేత్తలు అభినందించారు.

గిడుగుకు ఘన నివాళి



గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సాహితీవేత్తలు

కాకినాడ రూరల్: ఆంధ్రరాష్ట్రంలో తెలుగు వాడుక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు వర్ధంతిని పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో బుధవారం ఘన నివాళులర్పించారు. రామ్మూర్తి పంతులు చిత్రపటానికి గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, ఉంగరాల వెంకటేశ్వరరావు, దాసరి శ్రీధర్, ప్రసాద్ నాయుడు తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామ్మూర్తి ఉద్యమం వలన కొద్దిమందికే పరిమితమైన వ్యవహారిక భాష అందరికీ అందుబాటులో వచ్చిందన్నారు. 1940 జనవరి 22న ఆయన రాజమండ్రిలో కన్నుమూశారన్నారు.

చిన్నారులకు ఆధార్ నమోదు శిబిరాలు

కరప: అంగన్‌వాడీ కేంద్రాలలోని ఆధార్‌నమోదు కాని ఆరేళ్ల లోపు చిన్నారులకు కొత్తగా ఆధార్ నమోదు చేయించేందుకు రెండురోజులు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎం.అనుపమ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23, 24 తేదీలలో కరప-1 గ్రామ సచివాలయంలో కరప, కొరిపల్లి, పెనుగుదురు గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు, గొర్రిపూడి-1 గ్రామసచివాలయాల్లో గొర్రిపూడి, పెద్దాపురప్పాడు, కొంగోడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు ఆధార్ నమోదు చేయనున్నట్టు తెలిపారు. అరట్లకట్ట, సిరిపురం, కూరాడ, గురజనాపల్లి సచివాలయాల్లో కూడా 23, 24 తేదీలలో ఆయా గ్రామాల పరిధిలోని అంగన్‌వాడీ చిన్నారులకు కొత్తగా ఆధార్ నమోదు చేస్తారని ఎంపీడీఓ తెలిపారు.

హుండీల లెక్కింపు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో హుండీలను బుధవారం దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. 17 నెలల వ్యవధికి గాను 2.01 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు. ఈ హుండీల లెక్కింపులో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు .

పార్కింగ్‌లతో ప్రాణ సంకటం!

- వార్డుల్లో యథేచ్ఛగా వాహనాల నిలిపివేత
- పార్కింగ్ స్టాండ్‌లను తలపిస్తున్న వైనం
- బాధ్యతారాహిత్యంగా జూనియర్లు, వైద్య విద్యార్థుల వైఖరి
- వీల్‌చైర్, స్ట్రెచ్చర్ సేవలకు అంతరాయం

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో పలువురు జూనియర్ వైద్యులు, వైద్య విద్యార్థుల బాధ్యతారాహిత్యం రోగులకు శాపంగా పరిణమిస్తోంది. రోగికి ప్రాణాలు పోయాల్సిన వైద్యులే పరోక్షంగా వారికి ప్రాణ సంకటకంగా మారుతున్నారు. కాకినాడ జీజీహెచ్‌లో ఈ తంతు పరిపాటిగా మారింది. రాత్రి వేళల్లో అస్తవ్యస్తంగా తమ ద్విచక్రవాహనాలను నిలపకూడని ప్రదేశాల్లో నిలుపుతూ వైద్య సేవలకు ఆటంకం కలిగిస్తున్నారు. ఆసుపత్రి అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం రోగుల్లో ఆందోళనకు కారణమవుతోంది. వార్డుకు రోగులను తరలించే క్రమంలో ఈ వాహనాలే అడ్డంకులుగా మారుతున్నాయి.

వార్డు ఆవరణల్లోకి వాహనాలు

కాకినాడ జీజీహెచ్‌లో పలువురు మెడికోలు, జూనియర్ వైద్యుల తంతు రోగులకు తలనొప్పిగా మారింది. రాత్రి వేళ విధులకు హాజరవుతున్న వారిలో కొందరి వ్యవహారం వైద్య సేవలకు పరోక్షంగా ఆటంకం కలిగిస్తోంది. పార్కింగ్ ప్రదేశాలు వదిలేసి నేరుగా వార్డుల ఆవరణల్లోకి వాహనాలను పోనిస్తున్నారు. అలా చేయడం వల్ల కలిగే ఇబ్బందులు కంటి ముందే కనిపిస్తున్నా చలనం ఉండడం లేదు. రాత్రి ఎనిమిది గంటలు దాటితే సర్జికల్ భవంతిలోని వార్డులు వాహనాలతో కిక్కిరిసిపోతున్నాయి.



కార్డియాలజీ ఆవరణలో నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలు

స్ట్రెచ్చర్లు, వీల్ చైర్లకు ఆటంకం

రాత్రి వేళల్లో సర్జికల్ వార్డులోకి అత్యవసర విభాగం నుంచి రోగులను తరలిస్తారు. వీల్ చైర్ల సాయంతో రోగులను ఎంఎన్‌వోలు వార్డులకు చేరుస్తారు. అయితే అప్పటికే వాహనాల పార్కింగ్‌తో కిక్కిరిసిన ఆవరణ నుంచి రోగులను వార్డులకు తరలించడం ఓ ప్రయాసగా మారుతోంది. రద్దీగా ఉన్న రోడ్డులో తీవ్రమైన ట్రాఫిక్ కష్టాల నుంచి వాహనంతో బయటపడిన అనుభవం కలుగుతోంది. అత్యవసరంగా చికిత్స అందించాల్సిన పరిస్థితుల్లోనూ ఈ పద్మవ్యూహం నుంచి బయటపడడం ఓ సవాలు గానే మారుతోంది. స్ట్రెచ్చర్ల సాయంతో తరలించే రోగుల పరిస్థితి అయితే మరింత దయనీయంగా ఉంటోంది. తరలించే సిబ్బంది తోసుకెళుతున్న స్ట్రెచ్చర్‌లు ఆపి మరీ ఒక్కో వాహనాన్ని పక్కకు జరిపి ముందుకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి కొనసాగుతోంది.



సర్జికల్ వార్డు వద్ద నిలిపి ఉంచిన వాహనాలు

పార్కింగ్ ఉండి కూడా...

వార్డులను షెడ్లుగా మార్చేస్తున్న మెడికోల నిర్వాకంతో రోగులు సతమతమవుతున్నారు. వార్డుల్లోకి తీసుకువచ్చి మరీ వాహనాలను నిలపాల్సినంత అవసరం ఏమొచ్చిందన్న ప్రశ్నకు మాత్రం సమాధానం అంతుచిక్కడం లేదు. ఎందుకంటే, రాత్రి వేళ ఆసుపత్రిలో పార్కింగ్‌కి కొదువేలేదు. అయినా వాహనాలను వార్డుల్లోకే పోనిస్తున్నారు.

శీతల పానీయాలతో దంతాలకు దెబ్బ



దంత సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు సువర్ణరాజు

కాకినాడ రూరల్: శీతల పానీయాల వల్ల దంతాలు దెబ్బతినే అవకాశం ఉందని, ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్న వారు దంతాల పట్ల జాగ్రత్తలు పాటించాలని వైద్యుడు సువర్ణరాజు పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పలువురికి దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దంతాలలో డెంటిన్ అనే సున్నితమైన భాగం ఉంటుందని, ఇది దెబ్బతిన్నప్పుడు దంతాలలో రంధ్రాలు పడతాయన్నారు. దీని వల్ల వేడి, చల్లని, తీపి పదార్థాలు తీసుకున్నప్పుడు బాధ కలుగుతుందన్నారు. ఉదర కోశంలో ఉత్పత్తి అయ్యే ఆమ్లాలు నీటిలోకి వస్తాయని వీటి వలన దంతాలకు హాని కలుగుతుందన్నారు. రెండు పూటల దంతాలను బ్రష్‌తో శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బుద్ధరాజు సత్యనారాయణరాజు, అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టాతో పాటు ఉపాధి కల్పన

ఐఐఐపీటీ డైరెక్టర్ కృష్ణ

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే కళాశాలతో పాటు అనుబంధ కళాశాల విద్యార్థులకు పట్టాతో పాటు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు ఐఐఐపీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో బుధవారం సినర్జీస్ సంస్థ బీఫార్మసీ, ఎంఫార్మసీ అభ్యర్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిటోరియంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం తగిన విధంగా ఉపయోగించుకుని పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలన్నారు. ఇంటర్వ్యూలకు 200 మంది హాజరుకాగా 60 మందిని ఎంపికచేశారు. అనంతరం సినర్జీస్ సంస్థ ప్రతినిధులు వర్సిటీ ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ, రెక్టార్ కేవీ రమణలను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ రవిశర్మ, హెచ్‌ఆర్ మేనేజర్ రవితేజ, చంద్రశేఖర్, ఫార్మసీ విభాగాధిపతి భవానీలు పాల్గొన్నారు.



క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే ఐఐఐపీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి
- రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

కాకినాడ సిటీ: ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ నిరుద్యోగ భృతి ఇవ్వకపోవడం, ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు విమర్శించారు. శ్రీకాకుళంలో ఫిబ్రవరి ఆరో తేదీ నుంచి జరుగనున్న అఖిల భారత యువజన సమాఖ్య 22వ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను ఆయన కాకినాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి ఆరో తేదీ నుంచి 9వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగే మహాసభ ప్రారంభం సందర్భంగా 26 జిల్లాల నుంచి వేలాదిగా యువకులతో యువజన ప్రదర్శన, బహిరంగ సభ 7, 8, 9 తేదీల్లో జరిగే ప్రతినిధుల సభలో 600 మంది యువజన ప్రతినిధులు పాల్గొంటున్నారన్నారు. 22వ రాష్ట్ర మహా సభల్లో సమగ్ర యువజన విధానం, నూతన పరిశ్రమల ఏర్పాటు, స్థానిక యువతకు ఉపాధి, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, విశాఖ ఉక్కు పరిశ్రమ అభివృద్ధికి నిధులు, కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక నిధుల విడుదల వంటి వాటిపై విస్తృత చర్చ సాగుతుందన్నారు. అలాగే ప్రైవేటీకరణ రిజర్వేషన్, నిధులు, రాజధాని ప్రాంతాన్ని ఫ్రీజోన్ చేసి ఉద్యోగ అవకాశాలు, 26 జిల్లాల నుంచి నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించాలని, రాజధాని, పోలవరం నిర్మాణానికి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు సమీకరించాలని, మతోన్మాదానికి వ్యతిరేకంగా, రాజ్యాంగ పరిరక్షణ, కార్పొరేట్ వ్యక్తుల నల్లధనం పునఃపంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ తదితర అంశాలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మానెడ్డి వీరబాబు, మైఖేల్, మహేష్, బత్తుల జీవన్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పెనుగుదురులో పాడి రైతులకు మందులు అందజేస్తున్న నాయకులు, అధికారులు

కరప: పాడి పశువుల సంరక్షణకు నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం.రవికిరణ్ కోరారు. మండలం పెనుగుదురులో బుధవారం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. పశువుల్లో వ్యాధులను వివరించి, ఆయన రైతులకు అవగాహన కల్పించారు. పరాన్నజీవుల వల్ల కలిగే నష్టం, పాడి పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధులను ఆయన వివరించారు. ఈ సందర్భంగా శిబిరంలో 40 ఆవులకు, 140 పాడి గేదెలకు జలగ నివారణ మందులు, 20 గొర్రెలకు నట్టల నివారణ మందులు అందజేశారు. వెటర్నరీ డాక్టర్ జేవీఓ నాగేశ్వరరావు, గ్రామ కార్యదర్శి బి.చంద్రకళ, వెటర్నరీ అసిస్టెంట్ శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

దొంగతనం, దౌర్జన్యంపై ఫిర్యాదు

కరప: ప్రతి రోజూ కిరాణాషాపు వద్దకు వచ్చి దూషించడంతో పాటు అర్ధరాత్రి తలుపులు పగలకొట్టి, తమపై దౌర్జన్యంచేసి, కిరాణా వస్తువులు తీసుకువెళ్లిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కరప మండలం గొర్రిపూడి గ్రామంలో మేడిశెట్టి వెంకటలక్ష్మి కిరాణా షాపు నిర్వహిస్తోంది. అదే గ్రామానికి చెందిన పుణ్యమంతుల అప్పన్న సంక్రాంతి పండగ నుంచి ఇంటికి వచ్చి దూషిస్తూ గొడవచేస్తున్నాడు. నిందిడుతు అప్పన్న ఈనెల 14వ తేదీన అర్ధరాత్రి 11 గంటల సమయంలో వెంకటలక్ష్మి ఇంటికి వచ్చి, తలుపులు పగలకొట్టి, లోపలికి ప్రవేశించి ఆమె పైన, ఆమె భర్తపైన దౌర్జన్యంచేసి, కిరాణా వస్తువులు పట్టుకుని వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని గ్రామ పెద్దలలో పెట్టినా అప్పన్నలో మార్పు రాలేదు. దీంతో వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి.సునీత కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు

మహిళపై దాడి కేసులో ఒకరికి రెండేళ్ల జైలు

ఇద్దరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా

కాకినాడ లీగల్: ఇంటి సరిహద్దు విషయంలో గొడవ జరగడంతో మహిళపై అసభ్యంగా ప్రవర్తించి ఆమెను గాయపరిచి, బెదిరించిన కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు, వారి కుటుంబ సభ్యులకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.ప్రసన్నలక్ష్మి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ రామకృష్ణరావుపేట గోరుసువారి వీధికి చెందిన గొరుసు రాజకీర్తి, అతని తండ్రి నూకరాజు, చెల్లి సభరి కలిసి 2016లో ఇంటి పక్క నివసిస్తున్న నంబట్ల సత్యవతితో సరిహద్దు విషయమై గడవపడి ఆమెపై రాళ్లతోను, కర్రతోను గాయపరచారు. అలాగే సత్యవతి పట్ల రాజకీర్తి అసభ్యకరంగా ప్రవర్తించి, గాయపరిచి, బెదిరించాడు. దీంతో నంబట్ల సత్యవతి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో గొరుసు రాజకీర్తిపై నేరం రుజువుకావడంతో ఐపీసీ సెక్షన్ 354 ప్రకారం అసభ్యంగా ప్రవర్తించినందుకు రెండేళ్ల జైలు, ఐపీసీ సెక్షన్ 324 ప్రకారం గాయపరిచినందుకు ఆరు నెలల జైలు, మరో సెక్షన్ ప్రకారం రూ.వెయ్యి జరిమానా విధించారు.అలాగే నూకరాజు, సభరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పై రెండు శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని తీర్పులో పేర్కొన్నారు. ఏపీపీ గోసాల కమల కుమారి ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

పొగాకు ఉత్పత్తులపై నిషేధం విధించాలి

బోట్‌క్లబ్: ప్రభుత్వం పొగాకు ఉత్పత్తులపై నిషేధం విధించాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక సత్య దంత వైద్యశాలలో బుధవారం పొగాకు ఉత్పత్తులు, మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పొగాకు, గంజాయి ఉత్పత్తుల వినియోగాన్ని నిలిపివేసిన తర్వాత మొదటి 12 గంటల్లో మన శరీరంలో ఆక్సిజన్ స్థాయిలు పెరుగుతాయన్నారు. కార్బన్ మోనాక్సైడ్ స్థాయిలు తగ్గుతాయన్నారు. పొగాకు వినియోగానికి దూరంగా ఉంటే గుండెపోటును ఎదుర్కొనే ప్రమాదం తగ్గుతుందన్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్, మూత్రాశయం, గొంతు, రక్తం, గర్భాశయం, కాలేయం, నోరు, పాంక్రియాస్, పెద్దపేగు, ఇతర క్యాన్సర్లతో సహా అనేక ప్రాణాంతక వ్యాధులు ధూమపానంతో సంబంధం కలిగి ఉంటాయన్నారు. అసోసియేషన్ కన్వీనర్ శ్రీవల్లి మాట్లాడుతూ ధూమపాన రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నాగేంద్ర, సిరాజ్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ ఫిర్యాదులను సత్వరం పరిష్కరించండి

కార్పొరేషన్ కమిషనర్ భావన

కాకినాడ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశించారు. గ్రీవెన్స్ సెల్‌లో వచ్చిన ఫిర్యాదులపై బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. పలు ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలను సందర్శించి అక్కడి అపరిశుభ్ర వాతావరణాన్ని గుర్తించి పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. ప్రధానంగా ఖాళీ స్థలాల్లో చెత్త, మురుగునీరు నిలిచిపోకుండా చూడాలని, ఈ విషయమై ఆయా స్థల యజమానులకు సూచనలు ఇవ్వాలని కమిషనర్ కోరారు. నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే కన్నయ్యకాపునగర్‌లో డ్రైనేజీ ధ్వంసమై మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోందన్న ఫిర్యాదుపై స్వయంగా పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని అక్కడి ప్రత్యేకాధికారి టీపీఆర్వో శైలజకు సూచించారు. పర్యటనలో ఆమె వెంట అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు జిలానీ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ భావన

గ్రీన్ క్యాంటీన్ ప్రారంభం

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ప్రిన్సిపాల్ భవనం ఎదురుగా ఏర్పాటు చేసిన గ్రీన్ క్యాంటీన్‌ను బుధవారం జేఎన్‌టీయూకే ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ మురళీకృష్ణ ప్రారంభించారు. గతంలో ఉన్న క్యాంటిన్ స్టూడెంట్ ఎమినిటీ భవనం పై అంతస్తులో ఉండటం వల్ల విద్యార్థులు, టీచింగ్ సిబ్బందికి అసౌకర్యంగా ఉండటం వల్ల పాత స్థానంలో ఏర్పాటు చేశామని, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారితో పాటు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, డైరెక్టర్లు బీటీ కృష్ణ, రవీంద్ర, బాలకృష్ణ, ఏసురత్నం, కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ మోహనరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ: కాకినాడ అన్నమఘాటీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఉదయభాస్కర్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని నరసింహారోడ్డు, శివాలయం వీధి, తారకరామానగర్, ఘాటీ సెంటర్, కొవ్వూరు రోడ్డు, సుందరనగర్, పప్పులమిల్లు ఏరియా, రిక్షాలపేట, పరదేశమ్మపేట, ప్రసాదరావునగర్, సత్యదేవినగర్, ముగ్గపేట, రెల్లిపేట, బాపూజీనగర్, పద్మనాభనగర్, మేకా నారాయణమ్మ తోట, కాపులవీధి, మున్సిఫ్‌జంక్షన్, కొవ్వూరు, డి-మార్ట్, తూరంగి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

రీ సర్వే పక్కాగా నిర్వహించాలి

ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ: ప్రభుత్వం భూముల సర్వేకు సంబంధించి రీ సర్వే ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో గ్రామస్థాయిలో మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు బృందాలుగా ఏర్పడి రీ సర్వేకు సంబంధించి ముందస్తు సమాచారాన్ని రైతులకు అందజేయాలని ఆర్డీవో ఎస్ మల్లిబాబు తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సర్వే పూర్తి పారదర్శకంగా నిర్వహించాలన్నారు. రీ సర్వే జరగని గ్రామాల్లో పక్కాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. అలాగే రీ సర్వేకు సంబంధించి పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వచ్చే ఫిర్యాదులపై నిర్ణీత గడువు లోపు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పరిపాలనాధికారి డీబీఏ చైనులు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ అప్పారావు, తహసీల్దార్ వి.జితేంద్ర, ఎస్‌ఎల్‌ఎన్ కుమారి, పి.త్రినాథరావు, కె.చిన్నారావు, జీఆర్ ఠాగూర్, పీవీ సీతాపతిరావు, కె.సత్యనారాయణ, ఎస్ సత్యనారాయణ, కె.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

విమానాశ్రయానికి కృషి చేయండి

కాకినాడ: కాకినాడలో విమానాశ్రయం ఏర్పాటు చేసేందుకు ఇక్కడి ప్రజాప్రతినిధులు మరింత కృషి చేయాలని గోదావరి జిల్లా, కోకనాడ ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు వైడీ రామారావు కోరారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులకు సంఘం తరఫున లేఖ రాశారు. ఇటీవల అన్నవరం ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటుకు ప్రతిపాదనలు వెళ్లడం హర్షణీయమని, అయితే సదరు ప్రతిపాదనకు విమానయానశాఖ అనుమతి దక్కకపోవడం నిరుత్సాహపరిచిందన్నారు. ఎంతో కాలంగా గురజనాపల్లి ఉప్పు భూముల్లో ప్రతిపాదించిన విమానాశ్రయ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీలకు విజ్ఞప్తి చేశారు.

లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

కాకినాడ రూరల్: మండలంలోని పెనుమర్తి గ్రామంలో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయకుమార్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్.క్రిస్టోఫర్ బుధవారం ప్రారంభించారు. తొలుత గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ దేశంలో ఉన్న అత్యధిక నిమ్న, దళిత, మైనార్టీ సామాజిక వర్గాలకు సమ న్యాయం అందించేలా తమ పార్టీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పులుగు నాగేశ్వరరావు, శివకోటి రాము, బేదంపూడి కృష్ణ, కల్ధరి కుమారబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్ల అపహరణ

- సమీపంలో చెల్లాచెదరుగా విడిభాగాలు
- రాగి తీగల కోసం చేసిన పనిగా అనుమానం
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

కరప: మండలం గొర్రిపూడిలోని శ్రీరాజశేఖర పరస్పర సహకార ఎత్తిపోతల పథకం వద్ద రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అపహరణకు గురయ్యాయి. గొర్రిపూడిలోని ఎత్తిపోతల పథకం ద్వారా కరప, తాళ్లరేవు మండలాల్లోని ఆరు గ్రామాలకు సుమారు 4,800 ఎకరాలకు సాగునీరు అందుతోంది. 2009 సంవత్సరం ఫిబ్రవరి నెలలో అప్పటి తాళ్లరేవు ఎమ్మెల్యే దొమ్మేటి వెంకటేశ్వర్లు అభ్యర్థన మేరకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రూ.12.54 కోట్లు మంజూరు చేశారు. తదనంతర కాలంలో ఆ నిధులతో ఎత్తిపోతల పథకం నిర్మించి వైఎస్సార్ పేరుపెట్టారు. ప్రస్తుత రబీలో పంట కాలువల్లో నీటి మట్టం పడిపోవడంతో రైతుల వినతి మేరకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరందించేందుకు అధికారులు, స్థానిక నాయకులు నిర్ణయించారు. ఈ క్రమంలో గొర్రిపూడి నీటి సంఘం అధ్యక్షుడు జోకా అప్పలరాజు బుధవారం గండి వెంకటేశ్వరరావు, అనుకుల రాంబాబు తదితర నాయకులతో కల్సి ఎత్తిపోతల పథకం పరిశీలనకు వెళ్లారు. మోటార్లు పనిచేయకపోవడంతో విద్యుత్ సరఫరాను పరిశీలించగా అక్కడ ఉండే రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అపహరణకు గురైనట్టు గుర్తించారు. వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. పరిసర ప్రాంతాల్లోని పొదల్లో పరిశీలించగా ట్రాన్స్‌ఫార్మర్ల విడిభాగాలు కనిపించాయి. ఎవరో దొంగలు వాటిలోని రాగిని దొంగిలించి ఉంటారని భావిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనంపై నీటి సంఘం అధ్యక్షుడు, గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కూడా ఫిర్యాదు చేసినట్టు గ్రామస్తులు తెలిపారు. ఎస్సై టి.సునీత క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.